క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



జాతీయ చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులు

అగనంపూడి: జాతీయ స్థాయిలో నిర్వహించిన గో-కార్ట్ (టీమ్ రుద్ర) చాంపియన్‌షిప్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈమేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, రెక్టార్, డీన్లు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్సూరెన్స్ కొనసాగించాలి



మాట్లాడుతున్న ఉక్కు విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి సుశీలా గజేంద్రరావు

అగనంపూడి: ఉక్కు విశ్రాంత ఉద్యోగులకు పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్సూరెన్స్ కొనసాగించాలని అగనంపూడి ప్రాంత ఉక్కు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి గుదే సుశీలా గజేంద్రరావు కోరారు. సీడబ్ల్యూసీలో అగనంపూడి ప్రాంత విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వైద్య, ఆరోగ్య సౌకర్యాలు కల్పించే పథకంలో ఉక్కు యాజమాన్యం మార్పులు తీసుకువచ్చి, ఆర్థిక భారం మోపడం దారుణమన్నారు. కొత్త మెడికల్ ఇన్సూరెన్స్ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయిన సన్యాసిరావు, బలిరెడ్డి సత్యనారాయణ, బొండా ఈశ్వరరావు, సత్యనారాయణ సీత, కర్రి ఎర్రినాయుడు, పొన్నగంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫారం-1 గడువు పెంచాలని వినతి

గాజువాక: ప్రైవేట్ ఉపాధ్యాయుల వ్యక్తిగత సమచారానికి సంబంధించిన ఫారం-1 సమర్పించేందుకు గడువును నెలరోజుల పాటు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు విశాఖలో విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఫారం-1లో అందించాల్సిన ఉపాధ్యాయుల జీతభత్యాలతోపాటు ఇతర పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచడం, మరికొన్నివాటిపై ఉపాధ్యాయులకు అభ్యంతరాలున్న దృష్ట్యా గడువు పెంచాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో అప్సా ప్రతినిధులు మెట్ట జనార్దన్, పి.భాస్కరరావు, అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

తల్లిచెంతకు కుమార్తె



కుమార్తెను తల్లికు అప్పగిస్తున్న పోలీసులు


ఉక్కునగరం: సరిగ్గా చదవడం లేదని తల్లి మందలించడంతో సోమవారం ఓ విద్యార్థిని అదృశ్యమైంది. పోలీసులు సకాలంలో స్పందించి విద్యార్థినిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

వివరాలు.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, ఆమె తల్లి పాఠశాలకు వెళ్లారు. సరిగా చదవడం లేదని తెలుసుకుని తల్లి కుమార్తెను మందలించింది. తిరిగి వస్తూ అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద తల్లి పండ్లు కొంటుండగా ఆ అమ్మాయి తల్లి ఫోన్ పట్టుకుని స్కూటీతో వెళ్లి పోయింది. సెక్టార్-12 దుర్గ మాంబ గుడి వద్ద స్కూటీ వదిలి పెట్టి ఓలా బుక్ చేసుకుని పరారైంది. తల్లి వెంటనే స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కేశవరావు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కానిస్టేబుల్ జయలక్ష్మి ఆమె మొబైల్‌ను ట్రేస్ చేసి నగరంలోని బీచ్ వద్దకు వెళ్లి ఆ విద్యార్థినిని పట్టుకుని ఆమె తల్లికు అప్పగించారు.

ఇష్టారాజ్యంగా గుట్కా, ఖైనీ విక్రయాలు

పట్టించుకోని అధికారులు

నిషేధమా.. నీవెక్కడ?



ఆరోగ్యం గుల్ల

గుట్కా, ఖైనీల కారణంగా చిన్న వయసులోనే క్యాన్సర్ వంటి మహమ్మారి బారిన పడుతున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.



మత్తు జీవితాలను చిత్తు చేస్తోంది. కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తోంది... అలాంటి మత్తు పదార్థాలపై నిషేధం ఉన్నా.. అంగట్లో మాత్రం ఎక్కడ పడితే అక్కడే గుట్కా, ఖైనీలు లభ్యమవుతున్నాయి. దీంతో యువత, వృద్ధులు, రోజువారీ కూలీలు, విద్యార్థులు మత్తుకు బానిసలవుతున్నారు. ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. కుటుంబాలకు తీరని శోకం మిగుల్చుతున్నారు.

పెదగంట్యాడ: ఆరోగ్యానికి చేటు చేసే మత్తు పదార్థాలను నియంత్రించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కిరాణా దుకాణాల్లో విచ్చల విడిగా విక్రయిస్తున్నా అటు వైపు చూడడం లేదు. ఫలితంగా ఎంతో మంది భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నిషేధం ఉన్నా పెద గంట్యాడ మండలంలో గుట్కా, ఖైనీల వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రభుత్వం నిషేధించిన గుట్కా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. చదువుకునే విద్యార్థుల నుంచి పెద్దలు, వృద్ధులు గుట్కా, ఖైనీలకు బానిసవుతున్నారు. ఎక్కడ పడితే అక్కడే చిన్న చిన్న దుకాణాల్లో సైతం లభ్యమవుతున్నాయి. అయినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గుట్కా, ఖైనీలను వినియోగిస్తున్న వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఖైనీ, గుట్కా

ధరలు పెంచేసి..

గుట్కా ప్యాకెట్ గతంలో రూ.2 నుంచి రూ.5వరకూ విక్రయించేవారు. నిషేధించిన తర్వాత వాటి ధరలు అమాంతం పెంచేశారు. ప్రస్తుతం గుట్కా రూ.10 నుంచి రూ.15 వరకూ విక్రయిస్తున్నారు. ఖైనీ ప్యాకెట్ గతంలో రూ.5 నుంచి రూ.10 వరకూ ఉండేది. ఇప్పుడు రూ. 30 నుంచి రూ.40 వరకూ అమ్ముకొన్ని సొమ్ము చేసుకుంటున్నారు.

వ్యాపారం సాగుతోంది ఇలా..

మార్కెట్‌లోని హోల్‌సేల్ దుకాణాల నుంచి ఖైనీ, గుట్కా ప్యాకెట్లను మండలంలోని అన్ని ప్రాంతాల్లో పాన్ షాపులు, కిరణా దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఖైనీ గుట్కాలను బయటకు కనిపించకుండా లోపల ఉంచుతున్నారు. కొంతమంది హోల్‌సేల్ వ్యాపారులు రహస్యంగా ఖైనీలు, గుట్కాలు తెప్పించుకొని జాగ్రత్తగా భద్రపరుస్తున్నారు. ఏజెంట్ల ద్వారా దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. వాటి ధరపై నాలుగు నుంచి ఐదు రెట్లు ధర పెంచి వసూలు చేస్తున్నారు.

గుట్కా తింటే నోటి క్యాన్సర్ ముప్పు



గుట్కా తింటే నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా జీర్ణ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. పళ్లు అరిగిపోయి గారలు పడతాయి. నాలుక రుచిని కోల్పోతోంది. చివరకు గొంతు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

– డాక్టర్ మానస, యూపీహెచ్‌సీ సిద్ధేశ్వరం

మత్తుకు బానిస కావొద్దు



ప్రస్తుతం యువత చాలా వరకు మత్తుకు బానిసలవుతున్నారు. ఎక్కడ చూసినా గుట్కాలు, ఖైనీలు దొరుకుతుండడంతో చాలా మంది వాటిని కొనుగోలు చేసి ఆపై తమ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారు. యువత మత్తుకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు, అధికారులు దృష్టి పెట్టాలి.

– గొందేశి మహేశ్వరరెడ్డి, ఉక్కు నిర్వాసిత నాయకుడు

దాడులు చేస్తాం



నిషేధిత గుట్కా అమ్మకాలపై ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఎవరైనా అక్రమంగా నిషేధిత గుట్కా, ఖైనీ ప్యాకెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవు. దుకాణాల పై దాడులు చేస్తాం..ఎవరైనా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం.

– తోటాడ కామేశ్వరరావు, సీఐ,న్యూ పోలీస్ పోలీస్ స్టేషన్

తిప్పల దేవన్‌రెడ్డికి అభినందన



దేవన్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

మహారాణిపేట: గాజువాక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం దేవన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శాలువా కప్పి సన్మానించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ కామేశ్వరరావు, పోర్టు ప్రతినిధులు

పెదగంట్యాడ: గ్రామీణ క్రీడల అభివృద్ధిలో భాగంగా అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో గంగవరం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. విజేతలకు న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు, అదానీ గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్ సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు సీఈవో అమిత్ మాలిక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, యువతకు ఉపాధి, కమ్యూనిటీ ఇన్‌ఫ్రా వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదానీ ఫౌండేషన్ సీఎస్సార్ హెడ్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సోమనాథేశ్వర వజ్ర లింగ రథయాత్రకు ఘన స్వాగతం

అగనంపూడి: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో 2018లో గుజరాత్‌లో ప్రారంభమైన సోమనాథేశ్వర వజ్ర లింగం రథయాత్ర సోమవారం అగనంపూడి చేరిన సందర్భంగా ఈ ప్రాంత భక్తులు ఘన స్వాగతం పలికారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ప్రప్రథమంగా గుజరాత్ రాష్ట్రంలో వెలసిన సోమనాథేశ్వర వజ్ర లింగం దర్శనం నిమిత్తం 2018 అక్టోబర్‌లో ప్రారంభించి ఆరేళ్ల పాటు 65వేల గ్రామాల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలనే లక్ష్యంతో యాత్ర సాగిస్తున్నారు. రథ యాత్ర నిర్వాహకులు బీకే సుభాష్ భాయిజీ, బీకే మణి అక్కయ్య, బీకే రామలక్ష్మి అక్కయ్య మాట్లాడుతూ నేటి సమాజంలో ఆచారాలు, సాంప్రదాయాలు అడుగంటిపోతున్నాయన్నారు., నైతిక విలువలు పతనం కావడంతో అలజడి, అశాంతి పెరిగిపోతుందని.. ఈ సమయంలో గీతా జ్ఞానం, సహజ రాజయోగ శిక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, గంగాభవాని, ఎం .విశ్వనాథం, మణి, శంకరరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కాళిదాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.



యాత్రను ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీలు

జూట్ బ్యాగ్‌ల పంపిణీ

అగనంపూడి: ద్వారకాపురి వుడా ఫేజ్-2 అభివృద్ధికి అసోసియేషన్ ప్రతినిధుల కృషి అభినందనీయమని 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు అన్నారు. ద్వారకాపురి కాలనీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రజతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులందరికీ జూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ సంచుల నిషేధం, మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడంలో అసోసియేషన్ ప్రతినిధుల పాత్ర ఎంతైనా ఉందన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.జగన్నాథరావు, కె.వి.రాజు మాట్లాడుతూ కాలనీవాసుల సహకారంతో మౌలిక వసతులు కల్పించడం, ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోగలుగుతున్నామన్నారు. ఈపీడీసీఎల్ ఏఈ వి.సత్తిరాజు మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కె.ఎం.ఎ.నారాయణస్వామి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.సాయిరామ్‌రాజు, దేముడు, కె.రాజు, ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, రామ్‌గోపాల్, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అసోసియేషన్ రజతోత్సవం సందర్భంగా జూట్ బ్యాగ్‌లు అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

దాబాగార్డెన్స్: సిటూ అఖిల భారత మాజీ అధ్యక్షుడు బాలానందన్ శత జయంతి సభ సోమవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింగరావు మాట్లాడుతూ బాలనాందన్ జీవితాన్ని కార్మిక వర్గ ప్రయోజనాల కోసం అంకితం చేశారని కొనియాడారు. సాధారణ అసంఘటిత రంగ కార్మికుల కుటుంబంలో జన్మించిన బాలనందన్ జీవితాన్ని ఒక సాధారణ కార్మికుడిగా ప్రారంభించి సిటూ అఖిల భారత అధ్యక్షుడిగా ఎదిగారన్నారు. ముఖ్యంగా విద్యుత్, బీఎస్ఎన్ఎల్ కార్మికులను ఐక్యం చేసి సంఘాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. సిటూ కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అఖిల భారత అధ్యక్షుడిగా పని చేసి కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నడిపారన్నారు. ప్రైవేటీకరణ విధానాలు శరవేగంగా అమలు జరుగుతున్న తరుణంలో ఆయన స్ఫూర్తితో కార్మిక వర్గాన్ని అంతటినీ ఐక్యం చేసి, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బాలానందన్ కేరళ అసెంబ్లీ సభ్యుడిగా, లోక్ సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా పలుమార్లు ఎన్నికయ్యారన్నారు. కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేసి లేబర్ కోడ్స్ తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. ఫిబ్రవరి 5న లేబర్ కోడ్స్ రద్దుకు నిర్వహించే ప్రదర్శనలో కార్మికులను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటూ నాయకులు జ్యోతీశ్వరరావు, జగన్, మణి, అప్పలరాజు, సుబ్బారావు, కుమార మంగళం, వై.రాజు, నూకరాజు, వెంకట్రావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింగరావు

వైభవ వెంకన్నకు మంత్రి లోకేష్ పూజలు



పూజలు చేస్తున్న మంత్రి లోకేష్, స్పీకర్ అయ్యన్న తదితరులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేట గ్రీన్‌సిటీ ఆవరణలోని శ్రీ లక్ష్మీ ఆండాళ్ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అర్చనలు, అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పూత పూశారు.. మేత మేశారు!

- నెలల్లోనే బయట పడిన డొల్లతనం
- రాళ్లు తేలడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు



పిక్కతేలిన ఆటోనగర్ నుంచి తుంగ్లాం వెళ్లే రోడ్డు

అక్కిరెడ్డిపాలెం: అభివృద్ధి పనుల్లో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం డొల్లతనం బయటపడింది. రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ చేతివాటం చూపినా అధికారులు పట్టించుకోక పోవడంతో నాణ్యత తేలిపోయింది. నెలలు గడవక ముందే పిక్క తేలి ప్రమాదకరంగా మారడంతో ప్రజలు మండిపడుతున్నారు. ప్రజాధనంతో చేపట్టిన ఇలాంటి పనులు చేపట్టి ఎవరిని మోసం చేస్తారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల వ్యయం అంటూ ఇటు టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కాంట్రాక్టర్లుతో కలిసి అడిగే వారు లేరన్నట్లుగా ఇష్టాను సారంగా పనులు చేపట్టి ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబడుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 69వ వార్డు ఆటోనగర్ నుంచి తుంగ్లాం రోడ్డు ప్రమాదకరంగా మారింది. గతంలో బాగా ఉన్న రోడ్డును విస్తరించి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాం అంటూ వార్డు కార్పొరేటర్ ఊదరగొట్టారు. నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి కొన్ని నెలల కూడా కాకుండానే పనుల్లో డొల్లతనం బయటపడింది. గతంలో ఉన్న రోడ్డుపై తారు చిప్స్ వేసి రోడ్డు నున్నగా ఉండే విధంగా పనులు చేపట్టారు. ఇప్పుడు ఈ రోడ్డుపై తారుతో కూడిన గులక చిప్స్ ఏకంగా తేలిపోయాయి. అవి కాస్తా ప్రమాదకరంగా మారాయి. వీటిపై వెళ్తున్న ద్విచక్రవాహన చోదకులు జారిపడి ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇలా నాణ్యత లోపించిన పనులపై జీవీఎంసీ కమిషనర్ పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా రాజ్యాంగ దివస్



దళితులతో కలసి భోజనం చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు తదితరులు

పెదగంట్యాడ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు రాజ్యాంగ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించామని బీజేపీ గాజువాక నియోజక వర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో 9 ఎస్సీ కాలనీల్లో సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పెదగంట్యాడలోని ఎస్సీ కాలనీలో దళిత కుటుంబాలతో కలసి సోమవారం సహపంక్తి భోజనాలు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా ప్రగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో కొంకి వరలక్ష్మి, ధోని నాగరాజు, కిల్లాన ముసలయ్య, ప్రకాశ్, పెంటారావు, వంశీ, దీపక్, వెంకటరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు శివాలయంలో సోమవారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. రుత్వికుల ఆధ్వర్యంలో మహాశివునికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీవల్లీ దేవసేన సుబ్రమణ్య స్వామి, ఆంజనేయస్వామి, గాయత్రీమాత, నవగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. సీఈడీ విభాగం ఏజీఎం పెములూరి రమేష్‌బాబు దంపతుల సహకారంతో మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రునాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, ధర్మాల కనకరెడ్డి, నడుపూరు శ్రీనివాస్, నాగభూషణం, శశిభూషణరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు బీసీ గేటు శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కళావేదిక ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లుపిన్ యాజమాన్యం నిర్మించిన కళావేదికను సోమవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగ రమేష్‌బాబు మాట్లాడుతూ పార్మాకంపెనీలు హైస్కూల్‌లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో లుపిన్ పరవాడ హెడ్ ఫయాజ్ విక్టర్, హెచ్ఆర్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, పరవాడ ఎంఈవో గొంతిన సాయి శైలజ, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ గుర్రం అప్పలరాజు పాల్గొన్నారు.



కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ప్లాస్టిక్ భూతం



మింది విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అక్కిరెడ్డిపాలెం: మింది విద్యుత్ సబ్ స్టేషన్ పక్క కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా వచ్చి చేరుతున్నాయి. ఈ వ్యర్థాలు కల్వర్టు వద్ద డంప్ అవ్వడంతో కొన్ని మీటర్ల వరకు కాలువను కప్పేస్తున్నాయి. వీటిని నెల రోజుల కోసారి తొలగించి సర్వీసు రోడ్డుపై డంప్ చేయడం, దీంతో బెల్ నుంచి షీలానగర్ వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనాల తీవ్ర ఇబ్బందులు పడడం పరిపాటిగా మారిపోయింది. జీవీఎంసీ అధికారులు ఈ ప్రాంతంలో ఉన్న కాలువపై దృష్టి సారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.